# కరెంట్ అఫైర్స్

**1.** పాకిస్థాన్ 22వ ప్రధానమంత్రిగా పాకిస్థాన్ తెహ్రీక్–ఈ–ఇన్సాఫ్ (పీటీఐ) అధినేత, మాజీ క్రికెటర్ ఇమ్రాన్ ఖాన్ ఏ రోజున బాధ్యతలు చేపట్టారు?

1) 2018, ఆగస్టు 12　　2) 2018, ఆగస్టు 14

3) 2018, ఆగస్టు 16　　4) 2018, ఆగస్టు 18

**2.** మహదాయి నదీ జలాల వివాదానికి సంబంధించి తుదితీర్పును మహదాయి జల వివాద న్యాయమండలి దిల్లీలో ఏ రోజున వెల్లడించింది? (కర్ణాటక–గోవా–మహారాష్ట్ర మధ్య ఈ వివాదం నాలుగు దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉంది. కర్ణాటకకు 13.5 టీఎంసీలు, గోవాకు 24 టీఎంసీలు, మహారాష్ట్రకు 1.33 టీఎంసీల నీరు కేటాయిస్తూ తుది తీర్పు వెలువడింది. కర్ణాటక ధార్వాడ జిల్లా నరగుండ్‌లో 1118 రోజులు కొనసాగిన రైతుల నిరవధిక ఆందోళనకు ఈ తీర్పుతో తెరపడింది)

1) 2018, ఆగస్టు 11　　2) 2018, ఆగస్టు 12

3) 2018, ఆగస్టు 13　　4) 2018, ఆగస్టు 14

**3.** ఏ రాష్ట్ర గవర్నర్ అయిన బలరామ్‌జీ దాస్ టాండన్ (90) 2018, ఆగస్టు 14న మరణించారు? (2014 జులైలో ఈయన రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈయన పంజాబ్ ఉప ముఖ్యమంత్రిగా కూడా వ్యవహరించారు. బలరామ్‌జీ మరణం నేపథ్యంలో మధ్యప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్‌కు అదనంగా ఈ రాష్ట్ర గవర్నర్ బాధ్యతలను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అప్పగించారు)

1) ఛత్తీస్‌గఢ్　　2) ఉత్తరాఖండ్　　3) ఝార్ఖండ్　　4) మహారాష్ట్ర

**4.** గతంలో ఎన్నడూలేని విధంగా భారత కరెన్సీ రూపాయి విలువ (డాలర్‌తో పోలిస్తే) 2018, ఆగస్టు 14న ఎంత స్థాయికి పతనం అయ్యింది?

1) రూ. 67.67　　2) రూ. 65.06　　3) రూ. 70.08　　4) రూ. 71.15

**5.** కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ 'ఈజ్ ఆఫ్ లివింగ్ ఇండెక్స్' పేరుతో విడుదల చేసిన దేశంలోని 111 నగరాల జాబితాలో సౌకర్యవంతమైన నివాసయోగ్య నగరంగా ఏది నిలిచింది? (నవీ ముంబయి, గ్రేటర్ ముంబయిలు వరుసగా 2, 3 స్థానాల్లో ఉన్నాయి. తిరుపతి 4వ, విజయవాడ 9వ స్థానంలో నిలిచాయి. కరీంనగర్ 11వ, హైదరాబాద్ 27వ స్థానంలో ఉన్నాయి.)

1) చండీగఢ్　　2) పుణె　　3) ఇండోర్　　4) రాయ్‌పూర్

**6.** పార్కర్ సోలార్ ప్రోబ్ వ్యోమనౌకను అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా ఏ రోజున ప్రయోగించింది? (సూర్యుడిపై అధ్యయనం చేయడానికి ఇది ఏడేళ్ల సుదీర్ఘ ప్రయాణం చేయనుంది. కేప్ కెనావెరాల్ వైమానిక కేంద్రం నుంచి భారీ డెల్టా–4 రాకెట్ సాయంతో పార్కర్ ప్రోబ్ నింగిలోకి దూసుకెళ్లింది)

1) 2018, ఆగస్టు 10　　2) 2018, ఆగస్టు 12　　3) 2018, ఆగస్టు 14　　4) 2018, ఆగస్టు 16

**7.** 2018, ఆగస్టు 11న జస్టిస్ గీతా మిట్టల్ ఏ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు? (ఈ హైకోర్టు చరిత్రలో ఓ మహిళ ప్రధాన న్యాయమూర్తిగా నియమితులవడం ఇదే తొలిసారి)

1) కర్ణాటక　　2) ఒడిశా　　3) జమ్మూ కశ్మీర్　　4) పశ్చిమ్ బంగ

**8.** తెలంగాణ రాష్ట్రం నుంచి గ్రాండ్‌మాస్టర్ అయిన తొలి చెస్ క్రీడాకారుడిగా ఇటీవల ఎవరు ఘనత సాధించారు? (హన్మకొండకు చెందిన ఈ కుర్రాడు పద్నాలుగేళ్లకే ఈ హోదా సాధించాడు)

1) ఇరిగేసి అర్జున్　　2) నిహాల్ సరిన్　　3) వెంకట్రామన్　　4) హర్ష భరత్‌కోటి

**సమాధానాలు**

1-4; 2-4; 3-1; 4-3; 5-2; 6-2; 7-3; 8-1.

### అత్యంత నివాసయోగ్యమైన నగరంగా వియన్నా

★ స్థిరత్వం, ఆరోగ్యం, నాగరికత – పర్యావరణం, విద్య, మౌలిక వసతులు ప్రామాణికంగా 'ది ఎకనామిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్' 140 నగరాల్లో అధ్యయనం చేసి విడుదల చేసిన వార్షిక ప్రపంచ నివాసయోగ్య నగరాల సూచికలో ఆస్ట్రియా రాజధాని వియన్నా అగ్రస్థానంలో నిలిచింది. యుద్ధంతో అతలాకుతలమవుతున్న సిరియా రాజధాని డమాస్కస్ జాబితాలో చివరి స్థానంలో ఉంది.

★ ఏడేళ్లుగా మొదటి స్థానంలో ఉన్న ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ రెండో స్థానంలో నిలిచింది. ఒసాకా (జపాన్), కాల్గరి (కెనడా), సిడ్నీ (ఆస్ట్రేలియా) వరుసగా మూడు, నాలుగు, అయిదు స్థానాల్లో ఉన్నాయి.

★ అత్యంత నివాసయోగ్యమైన నగరంగా యూరప్‌కు చెందిన నగరం ఎంపిక కావడం ఇదే తొలిసారి.

★ ఈ జాబితాలో దక్షిణాసియా దేశాల నుంచి కేవలం ఆరు నగరాలు మాత్రమే స్థానం దక్కించుకున్నాయి. దిల్లీ 112, ముంబయి 117వ స్థానంలో నిలిచాయి.

## ప్రముఖుల మరణాలు

### మాజీ ప్రధాని వాజ్‌పేయీ

✪ మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయీ (93) 2018, ఆగస్టు 16న దిల్లీలోని ఎయిమ్స్‌లో మరణించారు. మధ్యప్రదేశ్ గ్వాలియర్‌లోని ఓ మధ్య తరగతి కుటుంబంలో వాజ్‌పేయీ 1924, డిసెంబరు 25న జన్మించారు. కాన్పూర్ విశ్వవిద్యాలయంలో రాజనీతి శాస్త్రంలో ఎంఏ చదివారు.

✪ వాజ్‌పేయీ 1957లో ఉత్తర్‌ప్రదేశ్‌లోని బలరాంపూర్ నియోజక వర్గం నుంచి తొలిసారి పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. ఆ తర్వాత 10 సార్లు పార్లమెంటు సభ్యుడిగా పలు రాష్ట్రాల నుంచి వాజ్‌పేయీ విజయాన్ని సాధించారు. రెండుసార్లు రాజ్యసభ సభ్యుడిగా వ్యవహరించారు.

✪ వాజ్‌పేయీ 3 సార్లు ప్రధానమంత్రిగా వ్యవహరించారు. 1996లో తొలిసారిగా 13 రోజులు, రెండోసారి 1998 – 99లో 13 నెలలు, మూడోసారి 1999 – 2004 మధ్య దాదాపు పూర్తికాలంపాటు ప్రధాని పదవిని నిర్వహించారు.

✪ 1998లో రెండోసారి ప్రధానిగా ఉన్నప్పుడు పోఖ్రాన్ అణు పరీక్షలు నిర్వహించారు. 1999లో దిల్లీ – లాహోర్ బస్సు సేవలు ప్రారంభించారు. 2001లో సర్వశిక్షా అభియాన్‌ను ఆవిష్కరించారు.

✪ 2015లో వాజ్‌పేయీని అత్యున్నత 'భారతరత్న' పురస్కారంతో సత్కరించారు.

### సోమ్‌నాథ్ ఛటర్జీ

✪ లోక్‌సభ మాజీ స్పీకర్ సోమనాథ్ ఛటర్జీ (89) 2018, ఆగస్టు 13న కోల్‌కతాలో మరణించారు.

✪ అసోంలోని తేజ్‌పూర్‌లో 1929, జులై 25న జన్మించారు. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో లా చదివారు. సుప్రీంకోర్టులో న్యాయవాదిగా కొనసాగుతూనే కార్మిక సంఘాలతో కలిసి పనిచేశారు.

✪ 1971లో తొలిసారిగా లోక్‌సభకు ఎన్నికయ్యారు. మొత్తంమీద 10 పర్యాయాలు లోక్‌సభ సభ్యుడిగా పనిచేశారు. 1984లో పశ్చిమ్ బంగాలోని జాదవ్‌పూర్ నుంచి పోటీచేసి మమతా బెనర్జీ చేతిలో ఓడారు. ఆయన జీవితంలో ఎదురైన ఒకే ఒక్క ఓటమి ఇది.

✪ 2004 – 09 మధ్య యూపీఏ–1 హయాంలో సోమనాథ్ ఛటర్జీ లోక్‌సభ స్పీకర్‌గా పనిచేశారు. భారత పార్లమెంట్ చరిత్రలో లోక్‌సభ స్పీకర్ అయిన వామపక్ష నేత సోమనాథ్ ఒక్కరే. ఆ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది.

### వీఎస్ నైపాల్

✪ భారత సంతతికి చెందిన ప్రఖ్యాత రచయిత, నోబెల్ సాహిత్య పురస్కార విజేత వీఎస్ నైపాల్ (85) 2018, ఆగస్టు 12న లండన్‌లో మరణించారు.

✪ వెస్టిండీస్‌లోని ట్రినిడాడ్‌లో 1932, ఆగస్టు 17న జన్మించిన నైపాల్ పూర్తిపేరు విద్యాధర్ సూరజ్ ప్రసాద్ నైపాల్. వలసవాదం, మతం, రాజకీయాలపై విమర్శనాత్మక రచనలు చేశారు.

- ఆయన తొలి పుస్తకం 'ది మిస్టిక్ మెజర్' 1951లో ప్రచురితమైంది. 1961లో ప్రచురితమైన 'ఏ హౌస్ ఫర్ మిస్టర్ బిశ్వాస్' విశేష ఆదరణ పొందింది. 1971లో 'ఇన్ ఏ ఫ్రీ స్టేట్' రచనకు బుకర్‌ప్రైజ్ లభించింది. సాహితీరంగంలో ఆయన చేసిన విశేషకృషిని గుర్తిస్తూ 1990లో ఎలిజబెత్ రాణి 'నైట్‌హుడ్' పురస్కారాన్ని ప్రదానం చేశారు. 2001లో నోబెల్ పురస్కారాన్ని గెలుచుకున్నారు.
- భారత్‌పై 'యాన్ ఏరియా ఆఫ్ డార్క్‌నెస్', 'ఏ వూండెడ్ సివిలైజేషన్' అనే రచనలు చేశారు. ఇస్లామిక్ సనాతన వాదంపైనా నైపాల్ రచనలు చేశారు. 'ఎమాంగ్ ద బిలీవర్స్', 'బియాండ్ బిలీఫ్' ఆ కోవకు చెందినవే.
- కాల్పానిక, కాల్పానికేతర సాహిత్యంలో నైపాల్ 30కి పైగా రచనలు చేశారు. 'ఏ బెండ్ ఇన్ ది రివర్', 'ది ఎనిగ్మా ఆఫ్ ఎరైవల్' లాంటి ప్రఖ్యాత రచనలు ఆయన జీవితాన్ని మలుపు తిప్పాయి. 'మాస్టర్ ఆఫ్ ది ఇంగ్లిష్ లాంగ్వేజ్'గా ఆయన మన్ననలు పొందారు.

## కోఫీ అన్నన్

- ఐక్యరాజ్య సమితి మాజీ ప్రధాన కార్యదర్శి కోఫీ అటా అన్నన్ (80) 2018, ఆగస్టు 18న స్విట్జర్లాండ్‌లో మరణించారు. ఐరాస ప్రధాన కార్యదర్శి పదవిని చేపట్టిన తొలి నల్లజాతీయుడు, ఆ పదవిని చేపట్టిన సంస్థ తొలి ఉద్యోగీ ఆయనే. 1997 – 2006 మధ్య వరుసగా రెండుసార్లు ఐరాస 7వ ప్రధాన కార్యదర్శిగా ప్రపంచానికి సేవలు అందించారు.
- ఘనాలోని కుమాసికు చెందిన ఉన్నత కుటుంబంలో 1938, ఏప్రిల్ 8న కవల సోదరి ఏఫుయాతో కలిసి అన్నన్ జన్మించారు. 1961లో ఇథియోపియాలో ఐరాస ఆర్థిక సంస్థ (ఆఫ్రికా)లో ఉద్యోగంలో చేరారు. ఈజిప్టులో యూఎన్ అత్యవసర దళంలో, జెనీవాలో శరణార్థుల విభాగ హైకమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. తర్వాత న్యూయార్క్‌లోని యూఎన్ ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. మానవ వనరులు, ఆర్థిక, బడ్జెట్, సిబ్బంది భద్రతా విభాగాల్లో వివిధ హోదాల్లో సేవలు అందించారు. ప్రపంచ శాంతి కోసం చేసిన కృషికి 2001లో నోబెల్ శాంతి బహుమతి పొందారు.

**రచయిత: సీఎచ్. కృష్ణ ప్రసాద్**